క్లుప్తంగా

కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలి



కేయూ క్యాంపస్ : కాకతీయ యూనివర్సిటీలో పనిచేస్తున్న బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగులను రెగ్యులరైజ్ చేయాలని కేయూ బోధనేతర కాంట్రాక్టు ఉద్యోగ సంఘాల జాక్ బాధ్యులు శుక్రవారం హైదరాబాద్‌లో విద్యాకమిషన్ చైర్మన్ ఆకునూరు మురళిని ఇతర సభ్యులను కలిసి వినతిపత్రాలను సమర్పించారు. 30 ఏళ్లుగా కాంట్రాక్టు ఉద్యోగులుగా పనిచేస్తున్న తాము అనేక సమస్యలు ఎదుర్కొంటున్నామని వినతిపత్రంలో పేర్కొన్నారు. విద్యా కమిషన్ చైర్మన్‌ను కలిసిన వారిలో ఆ ఉద్యోగ సంఘాల జాక్ బాధ్యులు విష్ణువర్ధన్, శివప్రసాద్, సురేష్‌కుమార్, శాగంటి శ్రీనివాస్, దయాకర్, రాజమౌళి, సుదయ్య తదితరులు ఉన్నారు.

నేడు విద్యుత్ ఉండని ప్రాంతాలు

హన్మకొండ : హనుమకొండలోని పలు ప్రాంతాల్లో ఈ నెల 22న విద్యుత్ సరఫరాకు అంతరాయం కలుగునుందని ఎన్పీడీసీఎల్ హనుమకొండ టౌన్ డీఈ జి.సాంబరెడ్డి తెలిపారు. కడిపికొండ టౌన్, బోడగుట్ట, ఆయోధ్యపురం ప్రాంతాల్లో ఉదయం 10 నుంచి 12 గంటల వరకు, విష్ణుపురి కాలనీ, జూబ్లీ మార్కెట్, సుబ్బయ్యపల్లి వ్యవసాయ ఫీడర్, సోమిడి వ్యవసాయ ఫీడర్ ప్రాంతాల్లో ఉదయం 11 నుంచి 11.30 వరకు, సాయంత్రం 5.30 నుంచి 6 గంటల వరకు, వేయిస్తంభాల దేవాలయం, యునాని హాస్పిటల్, శ్రీనివాస కిడ్నీ సెంటర్, న్యూ రాయపుర, రాయపుర వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11.30 గంటల వరకు, మహాత్మనగర్, విజయగణపతి కాలనీ, వినాయక టెంపుల్ ప్రాంతాల్లో ఉదయం 9.30 నుంచి 11.30 వరకు, పద్మాక్షి కాలనీ, రాజ్‌పుత్‌వాడ ప్రాంతాల్లో ఉదయం 9 నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు.

పరామర్శ



ఎంజీఎం : వరంగల్‌లో పోచమ్మమైదాన్‌లో గురువారం చంద్రశేఖర్ చేసిన దాడిలో భార్య పల్లవి, అత్త, మామలు తీవ్రంగా గాయపడి ఎంజీఎంలో చికిత్స పొందుతున్న విషయాన్ని తెలుసుకొని బీఎస్పీ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బొస్కె నాగరాజు, ప్రధాన కార్యదర్శి జన్ను అనిల్, ఎస్‌హెచ్‌ఆర్‌సీ రాష్ట్ర కార్యదర్శి గోరపూడి భాస్కర్‌లు శుక్రవారం తెలుసుకొని ఎం పరామర్శించారు. వారి ఆరోగ్యపరిస్థితి పై ఆరా తీసి మెరుగైన వైద్యం అందించాలని ఎంజీఎం సూపరింటెండెంట్‌ను కోరారు.

రూట్ సర్వే చేసి న్యాయం చేయాలి

హన్మకొండ : హనుమకొండ అలంకార్ కూడలిలో రోడ్డు మరమ్మతులో భాగంగా బస్సులను రూట్ మళ్లించి నడుపుతున్నారని, దీంతో కిలో మీటర్లు పెరిగి నష్టపోతున్నామని వెంటనే రూట్ సర్వే చేసి తమకు న్యాయం చేయాలని ఆర్టీసీ హైర్ బస్ ఓనర్స్ వెల్ఫేర్ అసోసియేషన్ వరంగల్ రీజియన్ చైర్మన్ మారిపల్లి రాంరెడ్డి కోరారు. శుక్రవారం హనుమకొండలో ఆర్టీసీ వరంగల్ ఆర్‌ఎం డి.విజయభానుకు వినతిపత్రం అందించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ హనుమకొండ జిల్లా బస్‌స్టేషన్ నుంచి పరకాల, భూపాలపల్లి, ములుగు, ఏటూరునాగారం, నర్సంపేట, మహబూబాబాద్ రూట్‌లో వెళ్లే బస్సులు మళ్లించిన రూట్‌లో రాకపోకలు సాగించడం ద్వారా 8 కిలోమీటర్లు పెరుగుతుందని వివరించారు. దీంతో తాము తీవ్రంగా నష్టపోతన్నామని తెలిపారు. డిపో మేనేజర్లకు ఈ విషయం చెప్పినా పట్టించుకోవడం లేదన్నారు. ఆర్‌ఎం స్పందించి రూట్ సర్వే చేసి అదనంగా ఖర్చవుతున్న ఇంధన నష్టానికి చెల్లింపులు చేయాలని కోరారు.

నిందితులకు శిక్షపడేలా చూడాలి

హన్మకొండ చౌరస్తా : తనపై దాడి చేసి హత మార్చేందుకు యత్నించిన నిందితులతో పాటు అందుకు పురిగొల్పిన వారికి శిక్ష పడేలా చూడాలని యువజన కాంగ్రెస్ నాయకుడు తోట పవన్ శుక్రవారం బాలసముద్రంలోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో రాజేందర్‌రెడ్డిని కలిసిన పవన్ లిఖిత పూర్వకంగా వినతిపత్రాన్ని అందజేశారు. నాటి బీఆర్‌ఎస్ ప్రభుత్వంలో అప్పటి ఎమ్మెల్యే దాస్యం వినయ్ భాస్కర్, అతని కుటుంబ సభ్యులు, కార్పొరేటర్ల అగడాలు, అక్రమాలను అడుగడుగునా నిలదీశానని అది మింగుడు పడని వినయ్ భాస్కర్ అప్పటి కార్పొరేటర్ సోదా కిరణ్, బీఆర్‌ఎస్ నాయకుడు రంజిత్‌రెడ్డి తన అనచరులతో హత్యాయత్నం చేశారని పేర్కొన్నారు. స్పందించిన ఎమ్మెల్యే న్యాయం జరిగేలా చూస్తానని హామీ ఇచ్చినట్లు పవన్ తెలిపాడు.

పిల్లలు ఆడుకునేదెలా..?

- పబ్లిక్‌గార్డెన్‌లో పాడైన ఆట వస్తువులు
- నిరాశతో వెనుదిరుగుతున్న చిన్నారులు
- పట్టించుకోని అధికారులు

హన్మకొండ చౌరస్తా: హనుమకొండలోని పబ్లిక్ గార్డెన్‌లో ఆహ్లాదం కరువైంది. సెలవు దినాల్లో సరదాగా పిల్లలతో పార్కుకు వచ్చే తల్లిదండ్రులకు విరిగిన ఆటబొమ్మలు దర్శనమిస్తున్నాయి. ఎంతో ఉత్సాహంతో ఆడుకోవాలని వస్తున్న చిన్నారులకు నిరాశే మిగులుతోంది. ఇక చేసేదేమీ లేక కాసేపు కాలక్షేపం చేసి వెనుదిరుగుతున్నారు.

అధికారుల నిర్లక్ష్యం

నిజాం కాలంలో దాదాపు 12 ఎకరాల విస్తీర్ణంలో పబ్లిక్‌గార్డెన్, అందులో టౌన్‌హాల్‌ను నిర్మించినట్లు సీనియర్ సిటిజన్లు చెబుతున్నారు. సుమారు ఐదేళ్ల క్రితం పబ్లిక్‌గార్డెన్‌లో ఓపెన్ జిమ్, ప్రహరీ, గార్డెనింగ్, ఆట వస్తువులు, టైల్స్ ఇతర పనులను చేశారు. అనతికాలంలోనే ఆట వస్తువులు విరిగి ప్రమాదకరంగా మారాయి. వాటికి మరమ్మతులు చేయడంలో, నూతన ఆట వస్తువులను ఏర్పాటు చేయడంలో అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారనే విమర్శలు వినిపిస్తున్నాయి. ఉన్నతాధికారులు స్పందించి పిల్లలకు అధునాతన ఆట వస్తువులను ఏర్పాటు చేయాలని నగర వాసులు కోరుతున్నారు.



ప్రమాదకరంగా ఉన్న జారుడుబల్ల ఇనుపజాలి



చిల్లులు పడడంతో పక్కన పడేసిన జారుడు బల్ల



ఊయల తెగడంతో నిరుపయోగంగా స్టాండ్లు



శిథిలావస్థలో రాకెట్ జారుడు బల్ల



పనిచేయని వాటర్ ఫౌంటేన్

సమాజాన్ని చైతన్యపర్చడంలో జర్నలిస్టులు కీలకం

- కేయూ రిజిస్ట్రార్ రామచంద్రం

కేయూ క్యాంపస్: సమాజాన్ని చైతన్యపర్చడంలో జర్నలిస్టుల పాత్ర ఎంతో కీలకమని కాకతీయ యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఆచార్య వి.రామచంద్రం అన్నారు. శుక్రవారం యూనివర్సిటీలోని జర్నలిజం విభాగంలో జర్నలిజం విద్యార్థులతో నిర్వహించిన ఫ్రెషర్స్‌డేలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. జర్నలిజం విద్యార్థులకు లీడర్‌షిప్ క్వాలిటీస్ కూడా ఉంటాయన్నారు. సమస్యల పరిష్కారానికి పాటు పడుతారన్నారు. జర్నలిజం విభాగంలోని పలు సమస్యల పరిష్కారానికి తనవంతుగా కృషి చేస్తానన్నారు. యూనివర్సిటీ కాలేజీ ప్రిన్సిపాల్ ఆచార్య టి.మనోహర్ మాట్లాడుతూ విద్యార్థులు రెగ్యులర్‌గా తరగతులకు హాజరు కావాలన్నారు. సమావేశంలో కేయూ జర్నలిజం విభాగం అధిపతి డాక్టర్ సంగని మల్లేశ్వర్, దూరవిద్యాకేంద్రం డైరెక్టర్ ఆచార్య బి.సురేష్‌లాల్, ఎస్‌ఎఫ్‌ఐ కోర్సుల డైరెక్టర్ కె.అయిలయ్య, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ మమత , జర్నలిజం విభాగం అధ్యాపకులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న రిజిస్ట్రార్ రామచంద్రం

నిందితులను కఠినంగా శిక్షించాలి

- వరంగల్ ఐఎంఏ జనరల్ సెక్రటరీ డాక్టర్ అజిత్

వరంగల్: భట్టుపల్లి రోడ్డులో డాక్టర్ గాదె సుమంత్ రెడ్డిపై గురువారం రాత్రి దాడి చేసిన నిందితులను గుర్తించి కఠినంగా శిక్షించాలని ఈ దాడిని వరంగల్ జిల్లా మెడికల్ అసోసియేషన్ తీవ్రంగా ఖండిస్తుందని అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి డాక్టర్ అజిత్‌మహ్మద్ అన్నారు. శుక్రవారం ఐఎంఏ హాల్‌లో జరిగిన సమావేశంలో సుమంత్‌రెడ్డిపై జరిగిన దాడి అర్థరహితమన్నారు. డాక్టర్ సుమంత్‌రెడ్డి, అతని కుటుంబానికి అండగా నిలుస్తామన్నారు. దాడికి కారణమైన నిందితులను గుర్తించడంతో పాటు వెంటనే చర్య తీసుకోవాలని సీపీని ముక్త కంఠంతో కో రుతున్నామని తెలిపారు. మా సీనియర్లు ఈ దాడిపై వర్ధన్నపేట ఎమ్మెల్యే నాగరాజుతో చర్చించారని కేసును వేగవంతం చేస్తూ దోషులను గుర్తించి చట్ట ప్రకారం శిక్షించడంలో పోలీసు అధికారులతో సమన్వయం చేసుకుంటామని హామీ ఇచ్చినట్లు తెలి పారు. సమావేశంలో రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు డాక్టర్ కాశీప్రసాద్‌రావు, మాగంటి శేషుమాధవ్, అశోక్‌రెడ్డి, కె.మల్లేశం, భోజ, ప్రవీణ్, మన్మోహన్‌రాజు, డాక్టర్ నరేష్‌కుమార్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రధాన కార్యదర్శి అజిత్‌మహ్మద్

ఎర్రజెండా వైపు యువత చూపు

- సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి శ్రీనివాస్‌రావు



న్యూశాయంపేట : రెడ్ బుక్‌లను ఆవిష్కరిస్తున్న శ్రీనివాస్‌రావు

న్యూశాయంపేట : పెట్టుబడి దారి వ్యవస్థకు కాలం చెల్లిందని, ఎర్రజెండా వైపు ప్రపంచ యువత చూస్తుందని సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి టి.శ్రీనివాస్‌రావు అన్నారు. శుక్రవారం హనుమకొండ పార్టీ ఆఫీస్‌లో కమ్యూనిస్టు ప్రణాళిక రెడ్‌బుక్ డే విడుదల సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొని ప్రసంగించారు. కమ్యూనిస్టు ప్రణాళిక ఏర్పడి 177 సంవత్సరాలు కొనసాగుతున్నా ప్రపంచంలో అన్ని భాషల్లో ప్రచురితం అయి ప్రజలు చదువుతున్నారని అన్నారు. మతోన్మాదులు మూఢనమ్మకాలు పెంచి పోషిస్తున్నారని వారికి సైన్స్ మీద నమ్మకం లేదన్నారు. కార్యక్రమంలో జిల్లా కార్యదర్శి కర్రె భిక్షపతి, ఆదరి శ్రీనివాస్, వీరస్వామి, భిక్షపతి, సదానందం, రవి, సారంగపాణి, సుదర్శన్, వెంకటరాజం పాల్గొన్నారు.

శతాబ్ది ఉత్సవాలను జయప్రదం చేయండి

వరంగల్: ఈనెల 25న వరంగల్ పోచమ్మమైదాన్ సమీపంలోని అబ్బాస్ ఫంక్షన్‌హాల్ జరుగనున్న సీపీఐ శతాబ్ది ఉత్సవాలను విజయవంతం చేయాలని రాష్ట్ర సహాయ కార్యదర్శి తక్కళ్ళపల్లి శ్రీనివాసరావు పిలుపునిచ్చారు. శుక్రవారం ఆయన ఉత్సవాల ఏర్పాట్లను పరిశీలించారు. ఉత్సవాలకు ముఖ్య అతిథిగా సీపీఐ జాతీయ కార్యదర్శి డాక్టర్ కె.నారాయణ వస్తున్నారని తెలిపారు. కార్యక్రమంలో సీపీఐ నాయకులు మేకల రవి, పంజాల రమేష్, షేక్ భాషుమియా, పనాసప్రసాద్, గన్నారపు రమేష్, బుస్స రవీందర్, ఏలేందర్ పాల్గొన్నారు.

26న మహా శివరాత్రి సాంస్కృతిక సమ్మేళనం

వరంగల్ చౌరస్తా : ఈ నెల 26న నిర్వహించనున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనాన్ని విజయవంతం చేయాలని ఇండస్ ఫౌండేషన్ చైర్మన్ ఏనుగుల రాకేష్‌రెడ్డి కోరారు. శుక్రవారం వరంగల్‌లోని గ్రాండ్ గాయత్రి హోటల్‌లో ఇండస్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో హనుమకొండలోని హయగ్రీవాచారి గ్రౌండ్స్‌లో జరుగనున్న మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనానికి సంబంధించిన వాల్‌పోస్టర్‌ను ఎన్ఐటీ ప్రొఫెసర్ పాండురంగారావు, పల్లె రాములుతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా రాకేష్‌రెడ్డి మాట్లాడుతూ జాగరణలో పాల్గొని మహాశివరాత్రి పర్వదినసాంస్కృతిక వైభవాన్ని ఆస్వాదించాలని పిలుపునిచ్చారు. పాండురంగారావు మాట్లాడుతూ మహాశివరాత్రి ఆధ్యాత్మిక సాంస్కృతిక సమ్మేళనం ద్వారా మన సంస్కృతి చాటి చెప్పడం ఆమోఘం అన్నారు. కార్యక్రమంలో కార్పోరేటర్ రవినాయక్, అభిషేక్, దీపక్, వద్దిరాజు విక్రమ్, పుష్ప, డాక్టర్ కొమురన్న, బోడ విజయ్, శానబోయిన రాజ్‌కుమార్, నరేష్, కృష్ణమూర్తి, కొడారి రవి, కంది యాదగిరి, రాజపోశాలు, యశ్వంత్, శివ, రోహిత్ , సుమన్‌గౌడ్‌లు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఏనుగుల రాకేష్‌రెడ్డి

మానవ హక్కులను కాపాడుతాం

నయీంనగర్ : రాజ్యాంగం ద్వారా ప్రజలకు సంక్రమించిన ప్రాథమిక హక్కులను రక్షిస్తూ, వాటి గురించి ప్రజలకు తెలియచేయడమే లక్ష్యంగా నేషనల్ హ్యూమన్ రైట్స్ కౌన్సిల్ పని చేస్తుందని జాతీయ చైర్మన్ డాక్టర్ సి.సంపత్‌కుమార్ తెలిపారు. శుక్రవారం హనుమకొండ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మానవ హక్కుల విషయంలో బాధితుల పక్షాన నిలబడి తమ సంస్థ న్యాయపరంగా అందాల్సిన రక్షణ, సహాయ సహకారాలు అందిస్తుందన్నారు. ఈ సమావేశంలో రాష్ట్ర అధ్యక్షుడు బుర్ర రమేష్, రాష్ట్ర మహిళా చైర్మన్ గుగులోతు కమలాబాయి, బాలకృష్ణ గౌడ్, రాజన్న, వెంకటేశ్వర్లు, ఆసీఫ్, తదితరులు పాల్గొన్నారు.

బడ్జెట్‌లో విద్యారంగానికి నిధులు కేటాయించాలి

హన్మకొండ: అసెంబ్లీ ఎన్నికల మేనిఫెస్టోలో కాంగ్రెస్ పార్టీ విద్యారంగానికి 15 శాతం నిధులు కేటాయిస్తామని ఇచ్చిన హామీ మేరకు బడ్జెట్‌లో కేటాయింపులు చేయాలని దళిత బహుజన ఫ్రంట్ రాష్ట్ర అధ్యక్షుడు రౌతు రమేష్ కుమార్ డిమాండ్ చేశారు. 2024–25 ఆర్థిక సంవత్సరం బడ్జెట్‌లో కేవలం 7 శాతం నిధులు మాత్రమే కేటాయించారని ఆయన ఒక ప్రకటనలో పేర్కొన్నారు. వచ్చే 2025–26 బడ్జెట్ లోనైనా 15 శాతం నిధులు కేటాయించి మాట నిలబెట్టుకోవాలన్నారు. రాష్ట్రంలో ప్రభుత్వ పాఠశాలలో కనీస వసతులు కరువై విద్యార్థులు సమస్యల మధ్య చదువులు సాగిస్తున్నారని అసర్ నివేదిక స్పష్టం చేసిందని గుర్తు చేశారు. రాష్ట్ర ప్రభుత్వం ఇటీవల విడుదల చేసిన 2024 అబ్‌స్టాక్ నివేదిక ప్ర కారం 11.95 శాతం పిల్లలు డ్రాప్ అవుట్‌గా మారి బడి బయట ఉన్నారని పేర్కొందని వివరించారు. ప్రభుత్వ విద్యాలయాల్లో నాణ్యమైన సమాన విద్యను అందించాలని కోరారు.

చికిత్స పొందుతున్న వ్యక్తి మృతి

మడికొండ : చికిత్స పొందుతూ వ్యక్తి మృతి చెందిన సంఘటన ఆర్.ఎస్.ఆర్ కాలనీలో చోటు చేసుకుంది. పోలీసులు కథనం ప్రకారం.. ఆర్.ఎస్.ఆర్ కాలనీలో నివాసం ఉంటున్న దాసరి సంపత్(35) రోజువారి కూలి పనులు చేసుకుంటూ సాయంత్రం ఇంటికి వచ్చేవాడు. రోజు మాదిరిగానే గురువారం పనికి వెళ్లకుండా ఇంట్లోనే ఉండి మ ద్యం తాగి ఉన్నాడు. సాయంత్రం బయటికి వెళ్లి ఎలుకల మందు తాగినట్లు పక్కన ఉన్న అనంత్‌కు చెప్పాడు. వారు తన అన్న కుమారుడు మొగిలిచర్లలో ఉండే దాసరి రాహుల్‌కు చెప్పగా అతను వెంట నే చికిత్స నిమిత్తం ఎంజీఎం ఆస్పత్రికి తరలించగా చికిత్స పొందుతూ శుక్రవారం ఉదయం మృతి చెందాడు. అతని మృతికి ఎవరిపై అనుమానం లే దని మృతుడి రాహుల్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు న మోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ కిషన్ తెలిపారు.

గంజాయి పట్టివేత

ఖిలా వరంగల్ : అక్రమంగా 750 గ్రాముల గంజాయిని తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను అరెస్ట్ చేసినట్లు మిల్స్‌కాలనీ ఎస్సై శ్రీకాంత్ తెలిపారు. శుక్రవారం సాయంత్రం వరంగల్–కరీమాబాద్ రహదారిపై ఎస్సై ఆధ్వర్యంలో వాహన తనిఖీలు నిర్వహిస్తున్నారు. కరీమాబాద్‌కు చెందిన నీలం శ్రీనివాస్, బౌరిశెట్టి మణిదీప్ హన్మకొండలోని శివ వద్ద 750 గ్రాములు ఎండు గంజాయిని కొనుగోలు చేసి బైక్‌పై బయల్దేరారు. ఈక్రమంలో కరీమాబాద్ రోడ్డుపై వాహన తనఖీలు నిర్వహిస్తుండగా అనుమానం వచ్చి బ్యాగు పరిశీలించగా గంజాయి లభించింది. వెంటనే వారిని అదుపులోకి తీసుకుని విచారించగా హనుమకొండలోని శివ వద్ద కొనుగోలు చేసి తిరిగి విక్రయించేందుకు కరీమాబాద్‌కు బయల్దేరామని నిందితులు విచారణలో పేర్కొన్నారు. నిందితులను అరెస్ట్ చేసి వారిపై కేసు నమోదు చేసి గంజాయిని స్వాధీన పర్చుకున్నట్లు ఎస్సై తెలిపారు.

సబ్సిడీలను కొనసాగించాలి

వరంగల్: ట్యాక్స్, మోటార్ క్యాబ్ సబ్సిడీ కొనసాగించాలని ప్రజా సంక్షేమ సమితి రాష్ట్ర అధ్యక్షుడు బాబురావు డిమాండ్ చేశారు. శుక్రవారం వరంగల్ జిల్లా జాయింట్ కలెక్టర్ సంధ్యారాణికి వినతిపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ తెలంగాణ రాష్ట్ర పరిశ్రమల శాఖలో అమలవుతున్న టీ–ప్రైడ్ పథకంతో ఎస్సీ, ఎస్టీ, వికలాంగులు ట్యాక్స్, మోటార్ క్యాబ్ సబ్సిడీలను రద్దు చేయాలని ఇటీవల జీఓను జారీ చేయడంపై ఆందోళన వ్యక్తం చేస్తున్నామని అన్నారు. కార్యక్రమంలో సమితి నాయకులు బాబురావు, అంజయ్య, శ్రీనివాస్‌లు పాల్గొన్నారు.

పాఠశాలలో స్వయంపాలన దినోత్సవం



మడికొండ : మడికొండలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో శుక్రవారం స్వయంపాలన దినోత్సవం ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు ఉపాధ్యాయులై తోటి విద్యార్థులకు పాఠ్యాంశాలను బోధించారు. హెచ్‌ఎంగా కె. హేమాంజలి, ఎంఈఓగా పి. ప్ర త్యూష, డీఈఓగా వి.హర్షణ్‌తేజ, పలువురు ఉపాధ్యాయులుగా వ్యవహరించారు. ఈ సందర్భంగా ఉత్తమ బోధకులను ఎంపిక చేసి హెచ్.ఎం మల్లారెడ్డి బహుమతులను అందజేశారు. కార్యక్రమంలో హైస్కూల్ ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

విక్రయానికి అంగడి భూమి

- ఫిర్యాదు చేసినా.. స్పందన కరువు
- కలెక్టర్‌కు వివరించిన కార్పొరేటర్, గ్రామస్తులు

హసన్‌పర్తి : 50 ఏళ్ల క్రితం అంగడి కోసం దానం చేసిన భూమిని అమ్ముతున్నారని స్థానిక కార్పొరేటర్, గ్రామస్తులు తెలిపారు. శుక్రవారం జిల్లా కలెక్టర్ ప్రావీణ్యకు ఫిర్యాదు చేశారు. అనంతరం కార్పొరేటర్ దివ్యారాణి, స్థానికులు మాట్లాడుతూ ఎల్లాపురం శివారులోని సర్వే నంబర్ 316లో సుమారు 2.30 ఎకరాల భూమిని ఓ దాత అంగడికి దానంగా ఇచ్చారని తెలిపారు. 20 ఏళ్ల పాటు ఇక్కడ అంగడి కొనసాగిందని చెప్పారు. ప్రస్తుతం ఆ భూమిలో పశువుల ఆస్పత్రి కూడా కొనసాగుతున్నట్లు పేర్కొన్నారు. అయితే కాలక్రమేణా అంగడి ఎత్తివేసినట్లు తెలిపారు. భూమి పడావుగా ఉండడంతో దాతల వారుసుల కన్ను ఈ భూమిపై పడిందన్నారు. దీంతో సంబంధిత అధికారుల సాయంతో పట్టాదార్ పాస్‌పుస్తకాలు పొందారని వివరించారు.

వివాదంలో ఉన్నప్పటికీ..

ఈ భూమిపై వివాదం నెలకొన్నప్పటికీ అధికారులు వ్యవసాయేతర భూమిగా (నాలా) అనుమతి ఇచ్చారని స్థానికులు తెలిపారు. ఫిర్యాదులు చేసినప్పటికీ నాలా అనుమతి ఎలా ఇచ్చారని కలెక్టర్‌ను అడిగారు. భూమి క్రయ విక్రయాలు జరుగుతున్నాయని స్థానికులు కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లారు. ఈ మేరకు పూర్తిస్థాయి విచారణ జరుపుతానని కలెక్టర్ హామీ ఇచ్చారని కార్పొరేటర్ దివ్యారాణి తెలిపారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కార్పొరేటర్, స్థానికులు

మాతృభాషను గౌరవించాలి



హన్మకొండ : సర్టిఫికెట్లు, మెడల్స్, షీల్డ్ అందుకున్న విద్యార్థులతో ఎంపీ కడియం కావ్య

- ఎంపీ డాక్టర్ కడియం కావ్య

హన్మకొండ : మాతృభాషను గౌరవించాలని వరంగల్ ఎంపీ డాక్టర్ కడియం కావ్య అన్నారు. శుక్రవారం హనుమకొండ నక్కలగుట్టలోని శ్రీ చైతన్య స్కూల్–4 బ్రాంచీలో మాతృ భాషాదినోత్సవాన్ని జరుపుకున్నారు. ఎంపీ ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగు మన మాతృ భాష అని, మాతృ భాషలో ప్రావీణ్యత సంపాదిస్తేనే పరభాషలో కూడా సులభంగా రాణించవచ్చన్నారు. తెలుగు విభాగం ఆధ్వర్యంలో నిర్వహించిన పద్యరచన పోటీలు, తెలుగు భాష ఔన్నత్యం పై నిర్వహించిన వ్యాసరచన పోటీల్లో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు ఎంపీ సర్టిఫికెట్లు, మెడల్స్, షీల్డ్ అందించారు. కార్యక్రమంలో స్కూల్ ప్రిన్సిపాల్ నళినీశ్రీ, పాఠశాల ఇన్‌చార్జ్ డి.నాగేశ్వరరావు, రవీందర్, శ్రీనివాసాచారి, నారాయణరెడ్డి పాల్గొన్నారు.

మాతృభాష అమ్మలాంటిది

హసన్‌పర్తి : మాతృభాష అమ్మలాంటిదని ప్రముఖ రచయిత్రి అరుణ కీర్తి పటాకారెడ్డి అన్నారు. ఎర్రగట్టుగుట్ట సమీపంలోని తెలంగాణ బాలికల గురుకుల విద్యాలయంలో మాతృభాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమానికి ఆమె ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడుతూ తెలుగుభాష ఔన్నత్యాన్ని గురించి వివరించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం అశోక్‌రెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

మాతృశ్రీ కళాశాలలో..

భీమారంలోని మాతృశ్రీ డిగ్రీ, పీజీ కళాశాలలో తెలుగు భాషా దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తెలంగాణ తల్లి చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన కార్యక్రమంలో కళాశాల కరస్పాండెంట్ శ్రీనివాస్ మాట్లాడుతూ మాతృభాష పరిరక్షణకు కృషి చేయాలని పిలుపునిచ్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ రజనీరెడ్డి, వైస్ ప్రిన్సిపాల్ శ్రీనివాస్‌రెడ్డి, అధ్యాపకులు పాల్గొన్నారు.

మాతృభాషను పరిరక్షించుకోవాలి

విద్యారణ్యపురి: మాతృభాషను పరిరక్షించుకోవాల్సిన అవసరం ఉందని హనుమకొండలోని ప్రభుత్వ మర్కజీ హైస్కూల్ హెచ్‌ఎం జీవీ రామారావు అన్నారు. శుక్రవారం హైస్కూల్‌లో తెలుగుశాఖ ఆధ్వర్యంలో నిర్వహించిన అంతర్జాతీయ మాతృభాషా దినోత్సవంలో ఆయన పాల్గొని మాట్లాడారు. సమావేశంలో సీనియర్ తెలుగు భాషోపాధ్యాయులు వల్సపైడి ,ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదాన శిబిరానికి రావాలని ఎమ్మెల్యేకు ఆహ్వానం



ఎమ్మెల్యే రాజేందర్‌రెడ్డికి బ్రోచర్‌ను అందజేస్తున్న జూనియర్ డాక్టర్లు

హన్మకొండ చౌరస్తా : మార్చి 2న కాకతీయ మెడికల్ కాలేజీలో నిర్వహించనున్న మెగా రక్తదాన శిబిరం ప్రారంభోత్సవానికి రావాలంటూ వరంగల్ పశ్చిమ ఎమ్మెల్యే నాయిని రాజేందర్‌రెడ్డిని కేఎంసీ జూనియర్ డాక్టర్లు కోరారు. శుక్రవారం బాలసముద్రంలోని క్యాంపు కార్యాలయంలో ఎమ్మెల్యేకు రక్తదాన శిబిరం బ్రోచర్‌ను అందించి ఆహ్వానించారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ కేఎంసీ అభివృద్ధికి రూ.2 కోట్ల నిధులు మంజూరు చేశామని, భవిష్యత్‌లో ఎలాంటి సమస్యలున్నా తన దృష్టికి తీసుకురావాలని సూచించారు. ఎమ్మెల్యేను కలిసిన వారిలో జూడాల సంఘం చైర్మన్ డాక్టర్ శ్రీనాథ్, జూనియర్ డాక్టర్లు లోకేష్, మదన్, బిందు, ముస్తఫా, ఇస్మాయిల్ ఉన్నారు.

సంక్షిప్త సమాచారం

బాలికల రక్షణకు సఖి సెంటర్లు



ఖిలా వరంగల్: మహిళలు, బాలికల రక్షణ కోసం సఖి సెంటర్లు పనిచేస్తున్నాయని సఖి ప్రతినిధి చందన తెలిపారు. శుక్రవారం 39వ డివిజన్ కాశికుంటలో ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలో ఆర్పీ స్వప్న ఆధ్వర్యంలో సఖి సెంటర్ సేవలు, హక్కులు చట్టాలపై బాలికల, మహిళలకు అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. సమావేశానికి ఆమె హాజరై సఖి సేవల వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరించి మాట్లాడారు. ఆపద సమయాల్లో 181 కాల్ చేసిన రెస్క్యూ చేయడం జరుగుతుందని, పాఠశాలల్లో అసభ్యకరమైన హింసలకు ఏమైనా గురైతే చైల్డ్ హెల్ప్‌లైన్ 1098కి ఫోన్ చేసి వారి సమస్యను తెలియచేయాలని సూచించారు.

బీజేపీతో పొత్తు డేంజర్

హన్మకొండ: అక్రమ సంసారం ఎంత ప్రమాదమో బీజేపీతో పొత్తు అంతకంటే డేంజర్ అని ఆదివాసీ కాంగ్రెస్ ఉమ్మడి వరంగల్ జిల్లా చైర్మన్ గుగులోతు రవీందర్ నాయక్ పేర్కొన్నారు. బీజేపీతో పొత్తు ఉన్న పార్టీలు చీలిపోయాయని ఆయన ఒక ప్రకటనలో తెలిపారు. బీజేపీ మొదట బలమైన ప్రాంతీయ పార్టీలకు వలపు వల విసురుతుందని, తర్వాత స్నేహహస్తం చాస్తుందని వ్యంగ్యోక్తులు విసిరారు. ఆ పార్టీలతో వేలు పట్టుకొని నడుస్తుండగా రెండో స్టేజీలో ఒడిలో కూర్చుంటుందని విమర్శించారు. మూడవ స్టేజీలో ఆ పార్టీ మెడలో కూర్చొని నాట్యం చేసి, ఆ పార్టీలను వామనుడు తొక్కినట్లు తొక్కేస్తుందన్నారు. మొదటి నుంచి పొత్తులో ఉన్న శివసేనను బీజేపీ రెండుగా చీల్చిందన్నారు. పార్లమెంట్‌లో బీజేపీకి అన్ని బిల్లులలో సహకరించిన బీజేడీ ఒక్క ఎంపీ సీటు కూడా గెలువలేదని వివరించారు.

వెటర్నరీ యూనివర్సిటీ వీసీగా హసన్‌పర్తి వాసి



జ్ఞాన ప్రకాశ్

హసన్‌పర్తి : హైదరాబాద్ వెటర్నరీ యూనివర్సిటీ వీసీగా హసన్‌పర్తికి చెందిన ప్రొఫెసర్ మంతెన జ్ఞాన ప్రకాష్ నియమితులయ్యారు. సామాన్య కుటుంబా నికి చెందిన జ్ఞాన ప్రకాష్ ప్రాథమిక, మధ్యమిక వి ద్య స్థానిక జిల్లా పరిషత్ పాఠశాలలో సాగింది. ఇంటర్మీడియట్ నగరంలో పూర్తి చేశారు. ఎంసెట్ ద్వా రా వెంటర్నీలో ప్రవేశం పొందారు. వీసీగా నియామకంపై చిన్ననాటి స్నేహితులు, మిత్రులు, స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

మసీదుల వద్ద సౌకర్యాలు కల్పించాలి

హన్మకొండ అర్బన్ : రానున్న రంజాన్ పండుగ సందర్భంగా నగరంలోని మసీదుల వద్ద సదుపాయాలు కల్పించాలని కోరుతూ కాంగ్రెస్ ముస్లీం మైనార్టీ సెల్ హనుమకొండ జిల్లా అధ్యక్షుడు అజీజ్ మీర్జా ఆధ్వర్యంలో నాయకులతో కలిసి శుక్రవారం హనుమకొండ కలెక్టర్ ప్రావీణ్యకు వినతి పత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మసీదుల వద్ద విద్యుత్, చల్లటి తాగునీరు ఏర్పాటు, పరిసరాల్లో పరిశుభ్రత ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. వినతిపత్రం ఇచ్చిన వారిలో మైనార్టీ సెల్ వరంగల్ జిల్లా అధ్యక్షుడు బాకీ భాయ్, నాయకులు బాబా భాయ్, అజహర్, హాజీ భాయ్, నవీద్, అక్బర్, అయూబ్, షేక్ గౌస్ ఉన్నారు.



కలెక్టర్‌కు వినతిపత్రం అందజేస్తున్న కాంగ్రెస్ మైనార్టీ సెల్ నాయకులు